<u>నివాళి</u>

# చెరబండరాజు

**చెరబండరాజు** మరణించాడు.

రాజ్యం పదేళ్ళు వెంటాడి వేధించిన ఫలితంగా ఎంతో అంకిత భావంతో, అవిశ్రాంతంగా ప్రజల కోసం పోరాడిన ఈ కవి అకాల మరణం చెందాడు. ప్రజల కోసం పోరాడితే – వారు ఆదివాసీ రైతాంగ విప్లవకారులైనా, ప్రజల భాషలో రాసే ప్రజాకవులైనా వారిపట్ల తను అంతే క్రూరంగా ఉంటానని రాజ్యం రుజువు చేసుకుంది.

తన గురువైన శ్రీకాకుళ విప్లవకవియోధుడు సుబ్బారావు పాణిగ్రాహిలా చెరబండరాజు రాజ్యం చేత నేరుగా కాల్చి చంపబడకపోయినా ఆయన మరణానికి కారణమైన బ్రెయిన్ ట్యూమర్‌కీ, ఆయన నిత్య నిర్బంధానికీ చాలా దగ్గర సంబంధం ఉంది. పదే పదే జైలు పాలవడం వల్లనే ఆ వ్యాధి ఆయనకు ప్రాణాంతకంగా మారింది. చెరబండరాజును మొదటిసారి 1971లో ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం (పి.డి. యాక్ట్) కింద, మళ్ళీ 1973లో ఆంతరంగిక భద్రతా చట్టం 'మీసా' కింద, మూడోసారి 1974లో పేరుమోసిన సికింద్రాబాద్ కుట్రకేసులోనూ అరెస్టుచేసి జైలుకు పంపారు. తీవ్రమైన డియోడనల్ అల్సర్‌తో బాధపడుతున్నా (బ్రెయిన్ ట్యూమర్ ఆ తర్వాత వచ్చింది) ఎమర్జెన్సీ కాలంలో మరోసారి అరెస్టుచేసి మిగతా విప్లవ రచయితలందరిలాగే ఎమర్జెన్సీ చివరిదాకా నిర్బంధంలోనే ఉంచారు. మిత్రులు ప్రేమగా పిలుచుకునే 'చెర' అనే మాట ఆ రకంగా ఆయనకు అతికినట్టు సరిపోయింది.

చెరబండరాజు అసలు పేరు బద్దం భాస్కర్‌రెడ్డి. 38 ఏళ్ళ క్రితం అప్పటి హైదరాబాద్ జిల్లాలోని అంకుశాపురం గ్రామంలో ఒక పేదరైతు కటుంబంలో పుట్టాడు. ప్రాచ్య కళాశాలలో తెలుగు సాహిత్యం చదువుకుని హైదరాబాద్‌లోని

---

చెరబండరాజు చనిపోయినప్పుడు ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (24.7.1982)లో రాసిన నివాళి వ్యాసానికి అనువాదం.

ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండేవాడు. 1960 దశకం ఉత్తరార్థంలో ఆరుగురు దిగంబర కవుల్లో ఒకడుగా ప్రసిద్ధుడయ్యాడు. అందరూ విలక్షణమైన పేర్లు (చెరబండరాజు, నిఖిలేశ్వర్, జ్వాలాముఖి, నగ్నముని, మహాస్వప్న, భైరవయ్య) పెట్టుకుని విలక్షణమైన కవిత్వాన్ని సృజించారు. వీరిది ప్రధానంగా విశ్వాస విధ్వంసక (iconoclastic movement) ఉద్యమం. వ్యక్తుల పట్ల, సిద్ధాంతాలపట్ల వారికి ఏవిధమైన గౌరవంలేదు. వారి భాష మన ఊహకు కూడా అందనంత తీవ్రమైన అశ్లీలంగా ఉంటుంది. (వారి పదచిత్రాలన్నీ వక్ర, అనైతిక లైంగిక చర్యలను సూచించేవే.) అయితే ఆ కాలమే అలాంటిది. గౌరవించదగ్గ వ్యక్తులు గాని, సిద్ధాంతాలు ('వాస్తవ రూపంలో'!) గాని ప్రపంచంలో అరుదైపోయిన రోజులు. జెకొస్లోవేకియాలో సోషలిజాన్ని కాపాడడానికి రివిజనిజం యుద్ధట్యాంకులెక్కి వీధుల్లో తిరుగాడిన రోజులు; సార్త్రే వంటి అసంప్రదాయవాది (maverick) తప్ప వినదగ్గ పెద్దమనిషి ఎవరూ లేరని ఫ్రెంచి యువత భావించిన రోజులు; పశ్చిమ దేశాల్లోని ఒక తరం యావత్తూ అరాచక, అసాంఘిక కార్యకలాపాలలో ఆనందం వెతుక్కుంటున్న రోజులు; మన విషయానికొస్తే – శ్రీకాకుళంలో నక్సల్బరీ ప్రభావాన్ని మనం ఇంకా పూర్తిగా గుర్తించని రోజులు; చైనా సాంస్కృతిక విప్లవంలోని, మావో ఆలోచనా విధానంలోని గొప్ప మౌలికతను ప్రపంచం ఇంకా పూర్తిగా అర్థం చేసుకోని రోజులు. అందువల్ల దిగంబర కవుల్ని 'పెటీ బూర్జువా అరాచకవాదుల'ని మన మార్క్సిస్టు చాదస్తపు పెద్దలు – వారి ధోరణినే అధికార మార్క్సిజమని (ఒ.ఎం) ఒకసారి కొశాంబి ఛీత్కారంగా అన్నాడు – తీసిపారేయడంలో ఆశ్చర్యం లేదు. వాళ్ళేమన్నప్పటికీ అధికార మార్క్సిజం చేత 'అభ్యుదయ' ముద్ర వేయించుకుని మద్రాసు సినీ సంస్కృతిలో వర్థిల్లుతున్న కవుల వెకిలి వ్యాపార ధోరణుల కంటే ఆగ్రహంతో నిండిన వీరి అశ్లీల కవిత్వంలోని నిజాయితీయే యువకులను, ప్రశ్నించే తత్వం గలవారిని ఆకర్షించింది. దిగంబర కవులు సైద్ధాంతికతను, వ్యవస్థీకృత రాజకీయాలను వ్యతిరేకించినప్పటికీ, సామాజిక, రాజకీయ సమస్యలకు స్పందించకుండా మాత్రం ఏనాడూ లేరు. వారి తొలి కవితాసంపుటితో పాటు ప్రకటించిన తొలి మేనిఫెస్టో (1965) ఒక అస్తిత్వవాద సిద్ధాంత ప్రతిపాదనలా కనిపిస్తుంది.

'*మానసిక దిగంబరత్వం కోసం నిత్య సచేతన ఆత్మస్ఫూర్తితో జీవించడమే మా ఆశయం. శ్వాసించే ప్రతి వ్యక్తితో సారూప్యం చెంది, వ్యక్తి అస్తిత్వ పరిరక్షణ*

*కోసం, అంతరంగంలో అణగిపడివున్న ఆరాటాన్ని, అసంతోషాన్ని, విసుగును అక్షరాల్లో వ్యక్తీకరించి నూతన విశ్వాసాన్ని, ఆశను కలిగించాలని మా తత్పరత'*

అని చెప్పుకున్నారు వాళ్ళు. వీరి కవిత్వం పాఠకుడిని తన సామాజిక ముసుగు తొలగించుకుని, తనని తాను నగ్నంగా చూసుకొమ్మని పదే పదే చెబుతుంది. రోజువారీ బాధల కోసం ఏడ్చే సామాన్యుల ధోరణి పట్ల వీరికి ఏవగింపు ఉండేది.

*నువ్వు ఎప్పుడు ఏడ్వలేదని? అస్తమానం నీ ముఖంపై పొగ వ్యాపించి బొగ్గు గనులు గుర్తుకొస్తాయి.(నిఖిలేశ్వర్)*

నిజానికి ఆ రోజుల్లో కూడ వారు దిగంబరంగా చూడదలచుకున్న అంతరంగం అవినీతిమయమైన పాశవిక సమాజానిదే కాదు, మనిషిలో దాగివున్న అసలు మనిషిది కూడ; అలాగే వాళ్ళు చింపేయాలనుకున్నది కూడ కపట రాజకీయ వేత్తలు, సిద్ధాంతకర్తలు వల్లించే ప్రజాస్వామ్యం, శాంతి, ప్రగతి వంటి మాటల ముసుగునే కాదు నాగరికత పేరిట మనందరం ధరించే దొంగ మర్యాదల ముసుగును కూడా. మరీ ముఖ్యంగా చెరబండరాజు, నగ్నముని, నిఖిలేశ్వర్‌ల రచనల్లో ఇది స్పష్టంగా కనిపిస్తుంది. దిగంబర కవుల్లో కొందరు అసలు రూపాన్ని దాచివుంచే సామాజిక మానవుడ్ని లక్ష్యం చేసుకుంటే చెరబండరాజు మాత్రం సమాజంలోని ద్వంద్వ ప్రవృత్తిని ఎండగట్టడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నాడు.

అదెలాగున్నా తమ రెండో ప్రణాళిక నాటికే (ఏడాది తర్వాత రాసింది) వాళ్ళు 'ప్రస్తుత పాపపు సమాజాన్ని నిర్మూలించి, సరికొత్త, ఉదాత్త సమాజాన్ని తీసుకురావాల'ని ప్రకటించుకున్నారు. అప్పటి చెరబండరాజు కవిత్వాన్ని ఈ కింది వాక్యాలు ప్రతిబింబిస్తాయి.

*అడుగులకు మడుగులొత్తి*
*అవకాశాల ఆసాముల పంచన*
*లేపిన మేడ పునాదులు కదలకముందు*
*చెరసాలకు కాదు కాదు నిన్ను*
*కసాయిశాలకు పంపాలనుంది*

1968లో విడుదల చేసిన వారి మూడవ మేనిఫెస్టోలో అయితే వారి ఆందోళన అంతా సమాజం గురించే ఉంది. అప్పటికీ వాళ్ళు సిద్ధాంతవ్యతిరేకులే

అయినా ఒకటి మాత్రం గుర్తించారు – 'ఈ భూగోళంపై దారిద్ర్యం, ఆకలి అలుముకుని ఉన్నంతవరకూ మార్క్సిస్టు దృక్పథాన్ని సవాల్ చేసే అధికారం ఎవరికీ లేదు' అన్నది.

మార్క్సిజం పేదరికానికి పరిష్కారం మాత్రమే అనుకునే అమాయకమైన ఆలోచన నుంచి, వీరిలో కనీసం నలుగురు పరిణతి చెంది విప్లవ రచయితల సంఘం ఏర్పడిన తర్వాత మార్క్సిస్ట్–లెనినిస్ట్ రచయితలయ్యారు. కమ్యూనిజం రివిజనిజంగా మారినపుడు నిరసనలు అన్నిట్నీ తిరస్కరించే ధోరణిలో సాగడం సహజమే. అయితే నిజాయితీతో కూడిన లక్ష్యం ఉన్నప్పుడు సైద్ధాంతిక అరాచకత్వం మనజాలదు. ఎప్పటికైనా ఇందులో ఏదో ఒకటి మరో దాన్ని అధిగమించక తప్పదు; ఆరుగురు దిగంబరకవుల్లో నలుగురిలో ఈ మార్పు కనిపిస్తుంది (తక్కిన ఇద్దరిలో ఒకాయన క్రమంగా రజనీశ్, మరెందరో బాబాలకు భక్తుడయ్యాడు). ఆ నలుగురూ, నక్సల్బరీ, శ్రీకాకుళం ప్రభావాలతో శ్రీశ్రీ, కుటుంబరావు, వరవరరావు, రమణారెడ్డిలతో కలిసి 1970 జులై 4 న విరసం స్థాపించారు. సహజంగానే చెరబండరాజు ఈ నలుగురిలో ఒకడుగా ఉన్నాడు. మరణించేవరకూ కూడా విరసం కార్యనిర్వాహక వర్గం సభ్యుడిగానే ఉన్నాడు. 1971–72 లో ప్రధాన కార్యదర్శిగా కూడ ఉన్నాడు.

నేనింతకుముందే చెప్పినట్టు వీరందరిలోకీ సామాజిక స్పృహ ఎక్కువగా ఉన్న కవి చెరబండరాజే. దిగంబరకవుల మూడో సంపుటి వెలువడే నాటికి చెరబండరాజు కవిత్వంలో విచక్షణారహితమైన ఏవగింపు ఇంకా అలాగే ఉన్నా, అతని భాషలో ఆర్ద్రత కంటే దిగ్భ్రాంతి కలిగించే ధోరణే ఎక్కువగా ఉన్నా, అతని కవిత్వంలో విప్లవ బీజాలు అప్పటికే ఉన్నాయి. 'వందేమాతరం' అనే గీతంలో అతను భారత మాతను ఒక వేశ్యగా సంబోధిస్తాడు.

*'అంతర్జాతీయ విపణిలో అంగాంగం తాకట్టు పెట్టిన అందం నీది*
*సంపన్నుల చేతుల్లో మైమరచి నిద్రిస్తున్న యవ్వనం నీది'*

(చాలాకాలం తర్వాత అత్యవసర పరిస్థితి సమయంలో ఈ పద్యాన్ని అతను జైల్లో చదివినపుడు, ఒక ఆరెస్సెస్ నాయకుడు ఘోరఅపచారానికి పాల్పడ్డావంటూ అతని మీద దాడి చేసాడు.)

అయితే విప్లవ కవిగా మారిన తర్వాత చెరబండరాజు వచన కవిత్వం మానేసి, గేయాన్ని తన కవితావాహికగా స్వీకరించాడు. విప్లవ రచయితల సంఘంలో ఉన్న రోజుల్లో అతను ప్రచురించిన 8 సంపుటాల్లో వచన కవితలు, పాటలు రెండూ ఉన్నప్పటికీ, నిరక్షరాస్యులయిన శ్రామిక జన సమూహానికి రాజకీయ ఆలోచనలు అందించాలంటే, పాటే దానికి సరయిన రూపమని గుర్తించిన కొద్దిమందిలో అతను ఒకడు. ఇలా భావించడంలో అతనికి సుబ్బారావు పాణిగ్రాహి వేసిన బాట ఉంది. అతనితో పాటు శివసాగరూ ఉన్నాడు. వీళ్ళిద్దరూ కలిసి, శ్రీశ్రీ వంటి తొలినాటి వామపక్ష కవులకూ, సమకాలీనులయిన జననాట్యమండలికి చెందిన గద్దర్ వంటి గాయక కవులకు మధ్య వారధి నిర్మించారు. శ్రీశ్రీ సందేశం, భావవ్యక్తీకరణ ఉద్వేగపూరితంగా ఉన్నప్పటికీ అతని భాష, పదచిత్రాలు మధ్యతరగతికి చెందినవే. గద్దర్ పాటలు ప్రజల భాషలో జానపద రాగాల్లో ఉంటాయి. ఈ రెండు రకాలవారి మధ్య వారధిగా నిలిచారు చెరబండరాజు, శివసాగర్‌లు. నక్సల్‌బరీ అనంతర కాలపు తెలుగు వామపక్ష కవిత్వంలో చెరబండరాజును ఒక మార్గదర్శకుడిగా చేసిన అతని ఈ కవితా లక్షణాలే అతన్ని రాజ్యానికి కంటగింపుగా చేశాయి.

*'కొండలు పగలేసినం*
*బండలనూ పిండినం*
*మా నెత్తురు కంకరగా*
*ప్రాజెక్టులు గట్టినం*
*శ్రమ ఎవడిదిరో*
*సిరి ఎవడిదిరో'*

అని శ్రామికజనంలోని అతి పేదలకు అర్థమయ్యే భాషలో రాసే కవి సహజంగానే ఈ ప్రాజెక్టుల లబ్దిదారుల ప్రయోజనాలను కాపాడేవారికి ప్రమాదకరంగా కనిపిస్తాడు. అందుకే చెరబండరాజు ఎవ్వరూ అనుభవించనంత వేధింపును ఎదుర్కోవలసివచ్చింది. 1971లో అతను (మరో ముగ్గురు దిగంబరకవులతో పాటు) 50 రోజులపాటు నిర్బంధంలో ఉన్నాడు; మళ్ళీ 1973 లో మీసా చట్టం కింద మరో 37 రోజులు జైల్లో ఉన్నాడు. రెండు సందర్భాలలోనూ అతని మీద అభియోగం – యువతను తన కవిత్వంతో రెచ్చగొడుతూ, సాయుధ

పోరాటానికి ఉసికొల్పుతున్నాడనే. సికింద్రాబాద్ కుట్ర కేసులో ఇరికించినందువల్ల 1974లో అతన్ని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. అత్యయిక పరిస్థితి ముగిసిన అనంతరం అతన్ని తిరిగి విధుల్లోకి తీసుకున్నారు గానీ, మరో మూడు రోజులకే డిఐజి (ఇంటెలిజెన్స్) నుంచి తీవ్ర అభ్యంతరం రావడంతో జిల్లా విద్యాధికారి ఆయన్ని మళ్లీ సస్పెండు చేసారు.

చివరకు, 1980 మార్చిలో అప్పటి విద్యాశాఖ మంత్రి (ప్రస్తుత ముఖ్యమంత్రి) శాసనసభలో ఒక టీచర్ ఎమ్మెల్సీ ప్రశ్నకు సమాధానంగా, చెరబండరాజును ఉద్యోగం నుంచి తొలగించినట్లు ప్రకటించారు. మరణించడానికి కొన్ని వారాల ముందు మాత్రమే ఆయన్ని ఆస్పత్రిలో స్పృహలేకుండా పడివున్నప్పుడు లాంఛనంగా తిరిగి ఉద్యోగంలోకి తీసుకున్నారు.

తను ఎదుర్కొన్న వేధింపులు, హింసల గురించి చెరబండరాజు ఒక శక్తివంతమైన కవిత రాసాడు.

*నేను అనాలోచితంగా అమాయకంగా*
*ఆకాశం కేసి చూస్తే*
*నా చూపుల ఎత్తుపల్లాల్ని కొలుస్తారు*
*నా పాదముద్రల్లో*
*విప్లవగీత చరణాల ఎత్తుగడల్ని పట్టుకోవడానికి*
*మట్టిని భద్రపరచి పరిశోధనల కంపుతారు*

క్రమంగా ఆయన కేన్సర్ బారిన పడ్డాడు. మూడు శస్త్రచికిత్సలు చేయించుకున్నాడు. తర్వాత కంటి చూపును కోల్పోయాడు. చివరికి చాలా రోజులు కోమాలో ఉన్న తర్వాత జూలై 2 న మరణించాడు. విప్లవ కవిత్వమంతా నినాదప్రాయమని సాధారణంగా అంటూ వుంటారు. దీన్నే తిరగేసి చెరబండరాజు కవిత్వం ఎన్నో గొప్ప విప్లవ నినాదాలను సృష్టించగలిగిందని కూడా చెప్పవచ్చు (ఇటీవల ఒక విమర్శకుడు అన్నట్టు, అదేమీ చిన్న విజయం కాదు). చెరబండరాజును ఆయన కవితా వస్తువుతో సహానుభూతి ఉన్నవారే కాక తెలంగాణ పట్టణాల్లోని గోడలన్నీ ఎల్లకాలం గుర్తుంచుకుంటాయి. ఎందుకంటే వాటి నిండా ఆయనవీ, ఆయన సహయర కవులైన గద్దర్, శివసాగర్, శ్రీశ్రీ వంటి వారి కవిత్వ చరణాలే నినాదాలుగా మారి భాసిల్లుతుంటాయి.